సాక్షి
నంద్యాల
గురువారం : 25 ఏప్రిల్ 2024



గణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: క్షేత్రంలో లోక కల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు.



గండర గండులు

హొళగుంద: బొతులింగేశ్వరస్వామి జాతర సందర్భంగా హొళగుందలో నిర్వహించిన బరువు ఎత్తే పోటీల్లో గజ్జహళ్లికి చెందిన దాసరి సుబ్బు, భీరప్ప, రామ ప్రతిభ చూపారు.



వన్యప్రాణులకు ముప్పు

ప్లాస్టిక్ వ్యర్థాలతో నల్లమలలోని వన్యప్రాణుల జీవన మనుగడకు ముప్పు వాటిల్లుతోందని అటవీ అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు హెచ్చరిస్తున్నారు.

8లో▸

న్యూస్‌రీల్

శ్రీశైలంలో రేపు కుంభోత్సవం

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 26వ తేదీ శుక్రవారం కుంభోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. భ్రమరాంబదేవికి సాత్విక బలి, స్వామివారికి అన్నాభిషేకం, కుంభహారతి (స్త్రీ వేషంలో పురుషుడు అమ్మవారికి హారతి) సమర్పిస్తారు. కుంభోత్సవాన్ని స్థానికులు ఊరి పండుగగా ఆచరిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం, ఏకాంతసేవ నిలుపుదల చేశారు. అలాగే ఆలయంలో అన్ని ఆర్జితసేవలు కూడా నిలుపుదల చేశారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో 25వ తేదీ గురువారం ఏపీఆర్‌జేసీ డీసీ సెట్, ఏపీఆర్ఎస్ క్యాట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీఆర్ఎస్ క్యాట్ విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. జూనియర్ కళాశాలతో పాటు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మధ్యాహ్నం 2.30 నుంచి 5గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని హాజరు కావాలని సూచించారు.

మూడు రోజులు భగభగలే!

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న రెండు, మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు గణనీయంగా పెరిగే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో 2-3 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. 46-47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చన్నారు. బుధవారం మహానందిలో 44.2, బనగానపల్లి, డోన్‌లలో 44.1 డిగ్రీలు, కోడుమూరులో 43.9, కర్నూలులో 43.1 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వచ్చే రెండు, మూడు రోజుల్లో మంత్రాలయం, కోడుమూరు, గూడూరు, దేవనకొండ, డోన్, చాగలమర్రి, గడివేముల, దొర్నిపాడు, రుద్రవరం మండలాల్లో ఎండలు, వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

వైభవంగా స్వాతి మహోత్సవం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిల క్షేత్రంలో బుధవారం అహోబిలేశుని జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వాతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాద వరదస్వాములను అమృతవల్లీ అమ్మవార్లను యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్ఛారణలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య శ్రీస్వాతి, శ్రీసుదర్శన హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి విశేష పుష్పాలంకరణ గావించిన ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాడ వీధుల్లో సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.



నందికొట్కూరులో ఆర్ఓకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దారా సుధీర్



బనగానపల్లెలో నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డి



ఆళ్లగడ్డలో నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి



ఆళ్లగడ్డలో ర్యాలీకి భారీగా తరలివచ్చిన జనం

సమరోత్సాహం

- అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లు
- నామినేషన్ దాఖలు చేసిన ఎంపీ అభ్యర్థి పోచా, ఎమ్మెల్యే అభ్యర్థులు గంగుల బిజేంద్రారెడ్డి, దారా సుధీర్, కాటసాని రామిరెడ్డి
- స్వచ్ఛందంగా తరలి వచ్చిన జనం, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



జిల్లా ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పోచా



జనసంద్రమైన నందికొట్కూరు పటేల్ సెంటర్



నంద్యాలలో కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నంద్యాల: ఎన్నికల రణరంగంలో వైఎస్సార్‌సీపీ సమరోత్సాహంతో ముందుకెళ్తోంది. ఇప్పటికే మేమంతా సిద్ధమంటూ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. విజయం తమదేనంటూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఆరో రోజు బుధవారం నామినేషన్ల పర్వంలో కోలాహలం నెలకొంది. నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, బనగానపల్లె నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం జనజాతరను తలపించింది. ఆయా నియోజకవర్గాల్లోని నిర్వహించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల భారీ ర్యాలీలు నభూతో.. నా భవిష్యత్ అన్నట్లుగా కనిపించాయి. ఓ వైపు వైఎస్సార్‌సీపీ జెండాల రెపరెపలు.. మరో వైపు హోరెత్తిన జై జగనన్న నినాదాలు.. ఇంకో వైపు యువకుల ఉత్సాహాల మధ్య అభ్యర్థులు నామినేషన్ల కేంద్రానికి చేరుకుని నామినేషన్లు అందజేశారు. నంద్యాల పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి స్థానిక పద్మావతి నగర్ సర్కిల్‌లో ఉన్న పోచా కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు, ప్రజలతో కలసి ర్యాలీగా బయలుదేరారు. అభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ, టపాకాయలు పేల్చి, భారీ గజమాలలు వేశారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీ పండుగ వాతావరణాన్ని తలపించింది. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ పోచా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించటం సంతోషంగా ఉందన్నారు.

నందికొట్కూరులో ప్రభంజనమై కదిలి..

నందికొట్కూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా దారాసుధీర్ అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా పట్టణంలోని పగిద్యాల రోడ్డు బ్రహ్మంగారి మఠంలో దారా సుధీర్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామి, పార్టీ సీనియర్ నాయకుడు చంద్రమౌళి తదితరులు పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలతో కలసి పాతబస్టాండ్, పటేల్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సంప్రదాయ డప్పు వాయిద్యాలు, డీజేలకు కార్యకర్తలు డ్యాన్స్‌లు వేస్తూ ముందుకు సాగారు. నామినేషన్ వేసేందుకు ప్రత్యేక వాహనంలో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌కు, సిద్ధార్థరెడ్డికి అభిమానులు, కార్యకర్తలు గజమాలలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్వో దాసుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దారా సుధీర్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా దారా సుధీర్, బైరెడ్డి సిద్ధార్థరెడ్డిలు మాట్లాడుతూ నామినేషన్‌కు తరలివచ్చిన జనాన్ని చూసి ప్రతిపక్ష పార్టీలకు ఇప్పటికే దిమ్మతిరిగి పోయి ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం సాకారమైందన్నారు.

బనగానపల్లెలో నిరాడంబరంగా..

బనగానపల్లె అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నిరాడంబరంగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కుటుంబ సభ్యులతో కలసి వెళ్లి తమ నామినేషన్ పత్రాలను ఆర్వో కాలేశ్వరరావుకు అందజేశారు. ముందుగా కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు తమ ఇంటి వద్ద వేదపండితుల ఆశీర్వచనాలు తీసుకొని గోమాతకు పూజలు చేసి అనంతరం నామినేషన్ కేంద్రానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని, చంద్రబాబు మాత్రం తన పాలనలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. మళ్లీ ఈ ఎన్నికల్లో చంద్రబాబు ఉత్తుత్తి వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ముందుకు వస్తున్నారని, మోసకారి మాటలను ప్రజలు నమ్మరన్నారు.

ఆళ్లగడ్డ అభిమాన సంద్రం..

ఆళ్లగడ్డ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి నామినేషన్ కార్యక్రమం అభిమాన సంద్రాన్ని తలపించింది. నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ అభిమానులు, ప్రజలు కార్యకర్తలతో పట్టణంలోని పురవీధులన్ని కిక్కిరిసిపోయాయి. పట్టణంలోని గంగుల స్వగృహం నుంచి నాలుగు రోడ్ల కూడలి, పాతబస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు స్వచ్ఛందంగా తరలి వచ్చిన ప్రజానీకంతో కలిసి గంగుల భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజల ఆశీస్సులతో తన నామినేషన్ పత్రాలను ఆర్ఓ మల్లికార్జునరెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈ ఎన్నికలు అన్ని సంక్షేమ పథకాలతో ప్రజల నమ్మకాన్ని చూరగొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అనునిత్యం ప్రజలు నమ్మించి నట్టేట ముంచి వెన్నుపోటు పొడిచే చంద్రబాబు నాయుడు మధ్య జరుగుతున్నట్లు ప్రజలు భావిస్తున్నారన్నారు. ఆళ్లగడ్డలో తాము చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయన్నారు.

టీడీపీ రెబల్‌గా భూమా బ్రహ్మం?

- నేడు నామినేషన్ దాఖలుకు రంగం సిద్ధం



సాక్షి, నంద్యాల: తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగలనుందా? నంద్యాల టీడీపీ రెబల్‌గా భూమా బ్రహ్మం బరిలో దిగనున్నారా? పార్టీ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పార్టీ కష్టకాలంలో వెన్నంటి ఉంటూ ఆర్థికంగా నష్టపోయిన తనను పట్టించుకోవడం లేదన్న ఆవేదన భూమా బ్రహ్మాన్ని వెంటాడుతోంది. తన అనుచరులను పార్టీ పదవుల నుంచి తప్పిస్తూ, పొమ్మనకుండా పొగబెడుతూ ఉండడంతో ఆత్మాభిమానం చంపుకోలేక పార్టీ రెబల్‌గా బరిలో నిలవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. గతేడాది నవంబర్‌లో మాటమాత్రమైన చెప్పకుండా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి భూమాను తప్పించి ఆ స్థానంలో మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నియమించింది. ఫరూక్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి భూమా బ్రహ్మాన్ని పట్టించుకోవడం మానేశారు. బూత్ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, పార్టీ పదవుల నుంచి భూమా అనుచరులను తొలగించి ఆ స్థానాల్లో ఫరూక్ తన అనుచరులను నియమించారు. పార్టీ పరంగా నిర్వహించిన కార్యక్రమాలకు భూమా బ్రహ్మాన్ని ఆహ్వానించకుండా అవమానిస్తూ వచ్చారు.

చంద్రబాబు చెప్పినా అలక వీడక..

నంద్యాలలో టీడీపీ పరిస్థితి ఏమాత్రం చెప్పుకోదగ్గ స్థితిలో లేదు. ఈ పరిస్థితుల్లో ఇద్దరు నేతలు ఉప్పు నిప్పులా వ్యవహరిస్తుండడంతో టీడీపీ అధిష్టానం నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో పాటు ఆ పార్టీ యువనేత నారా లోకేష్ నాయుడు ఇద్దరు వేర్వేరుగా భూమా బ్రహ్మంతో మాట్లాడారు. ఫరూక్‌తో కలిసి పనిచేయాలని ఆదేశించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం చేస్తామని చెప్పారు. కానీ, తన అనుచరులను మళ్లీ పార్టీ పదవుల్లో నియమిస్తేనే ఫరూక్‌తో పనిచేస్తానని భూమా బ్రహ్మం ఖరాఖండిగా చెప్పారు. భూమా షరతుకు ఫరూక్ ససేమిరా అనడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పార్టీ జిల్లా అధ్యక్షుడుతో పాటు పార్టీ పెద్దలు మాట్లాడినా భూమా బ్రహ్మం అలకపాన్పు వీడలేదు. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి ఎన్నికల్లో పోటీ చేసేందుకే భూమా బ్రహ్మం మొగ్గు చూపిస్తున్నట్లు తెలిసింది. నామినేషన్లలో చివరిరోజైనా గురువారం ఉదయం తన అనుచరులతో కలిసి నామినేషన్ వేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు బుధవారం తన అనుచరులు, ముఖ్య నేతలలో సమావేశమై ఒక నిర్ణయం తీసుకున్నారు. బ్రహ్మం బరిలో నిలిస్తే టీడీపీ అభ్యర్థికి ఘోర పరాజయం తప్పదని అధిష్టానికి ఇప్పటికే నివేదికలు వెళ్లాయి. దీంతో ఎలాగైనా భూమా బ్రహ్మంతో మాట్లాడి బుజ్జగించి, నిర్ణయం ఉపసంహరించుకునేలా చేయాలని జిల్లా నాయకులను రంగంలోకి దింపింది. దీంతో బుధవారం రాత్రి పార్టీ పెద్దలతో కలిసి చర్చించేందుకు బ్రహ్మం పట్టణ శివారుల్లోని అతిథి గృహానికి వెళ్లినట్లు సమాచారం. తన అనుచరుల నిర్ణయం మేరకు బరిలో నిలుస్తారా ? లేక పార్టీ నిర్ణయం మేరకు కట్టుబడి ఉంటారా ? అన్న విషయం నేడు తెలియనుంది.

ఆరో రోజు 74 నామినేషన్లు

- నంద్యాల పార్లమెంట్‌కు 12, ఆరు నియోజకవర్గాలకు 62 నామినేషన్లు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: జిల్లాలోని ఒక పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరుగుతున్న నామినేషన్ల దాఖలకు చివరి తేదీ సమీపిస్తుండంతో అభ్యర్థులు బుధవారం కోలాహలంగా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఆరో రోజు బుధవారం పార్లమెంట్ నియోజకవర్గానికి 12 మంది అభ్యర్థులు, అసెంబ్లీ నియోజకవర్గాలకు 62 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సంబంధిత పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు అందజేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు తెలిపారు. నంద్యాల పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానంద రెడ్డి, నీతి నిజాయితీ పార్టీ తరపున రామకృష్ణారెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా ఆరుగురు, టీడీపీ తనపున బైరెడ్డి శబరి, బహుజన సమాజ్ పార్టీ తరపున చిన్న మౌలాలి, కాంగ్రెస్ పార్టీ తరపున లక్ష్మీ నరసింహ యాదవ్, సమాజ్వాది పార్టీ తరపున సి. పాండురంగ యాదవ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

➡ ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ తరపున గంగుల బిజేంద్రారెడ్డి (రెండు సెట్లు), మరోసెట్ గంగుల సారిక, జై భీమ్రావు భారత్ పార్టీ తరపున దారా శేఖర్, కాంగ్రెస్ పార్టీ తరపున చాకలి పుల్లయ్య నామినేషన్లు వేశారు.

➡ శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్వతంత్ర అభ్యర్థులుగా జయ కుమార్ స్వామి, ఈశ్వర్ రెడ్డి, నాగ మల్లికార్జున రెడ్డి, సమాజ్‌వాద్ పార్టీ తరపున వై మధు, టీడీపీ తరపున బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నేషనల్ మహాసభ పార్టీ తరపున జి మల్లికార్జున, ఎస్‌డీపీఐ తరపున ఎస్. మహమ్మద్ యూనిస్, నవభారత్ నిర్మాణ సేవా పార్టీ తరపున కె. మధు గౌడ్, జై భీం రావు భారత్ పార్టీ తరపున ఎం సుస్మితలు నామినేషన్లు దాఖలు చేశారు.

➡ నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దారా సుధీర్ (రెండుసెట్లు), టీడీపీ అభ్యర్థి జయసూర్య (మూడుసెట్లు), జయరాజ్, కాంగ్రెస్ పార్టీ తరపున తొగురు ఆర్థర్ (రెండు సెట్లు), టి. నాగరాజు, స్వతంత్ర అభ్యర్థిగా ఎం.నాగలింగంలు నామినేషన్లు వేశారు.

➡ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థులుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తరపున గోకుల కృష్ణారెడ్డి, సమాజ్ వాదీ పార్టీ తరపున షేక్ ఫరిదాబి(రెండు సెట్లు), టీడీపీ తరపున ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు ఆయా పార్టీల నుంచి మరో నలుగురు, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు, ఎస్‌డీపీఐ నుంచి షేక్ మొహమ్మద్ నామినేషన్లు వేశారు.

➡ బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థులుగా వైఎస్సార్‌సీపీ నుంచి కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ, టీడీపీ తరపున బీసీ జనార్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తరపున పుల్లయ్య, స్వతంత్ర అభ్యర్థులుగా ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు.

➡ డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ తరపున బుగ్గన రాజేంద్రనాథ్, టీడీపీ తరపున కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గార్లపాటి మద్దిలేటిస్వామి, స్వతంత్ర అభ్యర్థులు పది మంది నామినేషన్లు దాఖలు చేశారు.

మృతులకు సంతాపం తెలిపి.. హంతకులను అక్కున చేర్చుకుని!

- 50 ఏళ్లుగా కోట్ల, కేఈ కుటుంబాల మధ్య హత్యా రాజకీయాలు
- ఎనిమిదేళ్ల క్రితం కోట్ల వర్గీయుడి దారుణ హత్య
- హత్య కేసు నిందితులు నేడు కోట్ల వెంట ప్రచారం
- టీడీపీ అభ్యర్థి తీరుపై ప్రజల ఆక్రోశం



టీడీపీ నాయకులకు గజమాల సమర్పిస్తున్న హత్య కేసు నిందితులు చిన్నకాంత్, పెద్దకాంత్



టీడీపీ నాయకుడు ధర్మవరం సుబ్బారెడ్డితో లద్దగిరి శ్రీను హత్యకేసు నిందితుడైన ఒల్లె లక్ష్మన్న

డోన్: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరంటారు. కానీ అర్ధ శతాబ్దం పాటు హత్యా రాజకీయాలు చేసి అమాయకులను బలిగొన్న నేతలు ఇప్పుడు ఒక్కటై అధికారం కోసం పాకులాడటం చూసి ఓటర్లు అసహ్యించుకుంటున్నారు. డోన్ నియోజకవర్గంలో ఒకప్పుడు మాజీ కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి కుటుంబాలు పరస్పరం కత్తులు దూసుకున్నాయి. ఎంతో మంది కార్యకర్తలు వారి ఫ్యాక్షన్ రాజకీయాలకు బలయ్యారు. నెత్తుటి చారికల సాక్షిగా నాడు అనుచరులకు శ్రద్ధాంజలి ఘటించిన చేతులే నేడు హంతకులను అక్కున చేర్చుకోవడం చూసి ప్రజలు ఆక్రోశం వెల్లగక్కుతున్నారు. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి ఎన్నాళ్లుగానో ముఖ్య అనుచరులుగా ఉంటూ వస్తున్న కొచ్చెర్వు గ్రామానికి చెందిన లద్దగిరి శ్రీను అనే వ్యక్తిని దారుణంగా హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితులందరూ ఇప్పుడు కోట్ల వెంట తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. కోట్ల తీరును చూసి హతుడు లద్దగిరి శ్రీను కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న ప్యాపిలి మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన ఒల్లె బోయ లక్ష్మన్న టీడీపీ ఎన్నికల ప్రచారంలో క్రియాశీలకంగా పాల్గొంటున్నారు. ఈ కేసులో 302, 120బీ సెక్షన్ల కింద ప్యాపిలి మండలం జలదుర్గం పోలీసుస్టేషన్‌లో ఒల్లె లక్ష్మన్నతో పాటు ఆరుగురు ముద్దాయిలుగా ఉన్నారు.

కన్నతండ్రిని కడతేర్చిన కేసులో..

స్థానిక చిగురుమానుపేటకు చెందిన కృపానందం వ్యక్తిగత కారణాలతో దారుణంగా హత్య చేసిన ముద్దాయిలైన అతని కుమారులు చిన్నకాంత్, పెద్దకాంత్‌లు టీడీపీ రాజకీయాలలో క్రియాశీలకంగా పాల్గొంటూ కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వెంట ప్రచారంలో పాల్గొంటున్నారు. వీరు వైఎస్ఆర్‌సీపీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు పోస్టు ప్రసాద్‌పై హత్యాయత్నం చేసిన కేసులో నిందితులు. వీరిపై గతంలో గంజాయి, పలు హత్యాయత్నం కేసులు కూడా పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదయ్యాయి. వీరిపై గతంలో 302, రెడ్‌విత్ 149, 307, 326, 324, 148, 147 తదితర సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. హత్యా రాజకీయాలను తాము ప్రోత్సహించమని సుద్దులు చెబుతున్న టీడీపీ నాయకులు పై రెండు కేసులలో నిందితులతో పాటు అక్రమ మద్యం రవాణా, నకిలీ మద్యం తయారీ, భూకబ్జాదారులతో సంబంధాలు లేవని ప్రజలకు బాహాటంగా చెప్పగలరని వైఎస్ఆర్‌సీపీ నాయకులు నిలదీస్తున్నారు.

ఇక ఆట,పాటలు

- పాఠశాలలకు జూన్ 11 వరకు వేసవి సెలవులు
- జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): ఏడాదిపాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆటవిడుపు దొరికింది. ఈ నెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ వేసవి సెలవులు ప్రకటించింది. జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల 1,372 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 2.02 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరికీ వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని పలు ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలిచ్చారు. విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలను అందజేశారు.

తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

వేసవి సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సైతం నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ఫిర్యాదులు వస్తే పాఠశాల అనుమతి రద్దు చేస్తాం.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

క్లుప్తంగా

ట్రావెల్స్ బస్సుకు రూ. 2.44 లక్షల జరిమానా



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్: గుజరాత్ రాష్ట్రానికి చెందిన ట్రావెల్స్ స్లీపర్ బస్‌కు రూ. 2.44 లక్షల జరిమానా విధించినట్లు ఆర్‌టీఓ క్రాంతికుమార్ తెలిపారు. పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో బెంగళూరు నుంచి ఉత్తరప్రదేశ్‌కు వెళుతున్న ట్రావెల్స్ స్లీపర్ బస్‌ను తనిఖీ చేశారు. బస్సు రికార్డులు పరిశీలించగా రోడ్ ట్యాక్స్, పర్మిట్, ఫిట్‌నెస్ లేకుండా వాహనాన్ని నడుపుతుండటంతో బస్‌ను సీజ్ చేసి జరిమానా విధించామని ఆర్‌టీఓ తెలిపారు.

రేపు నామినేషన్ల పరిశీలన



మాట్లాడుతున్న పాణ్యం ఆర్‌ఓ మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఈనెల 26వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరవ్వాలని పాణ్యం ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య సూచించారు. బుధవారం ఆమె తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నామినేషన్ల స్క్రూటినీకి పోటీ చేసే అభ్యర్థి కాని, ప్రతిపాదించిన వ్యక్తికాని హాజరవ్వచ్చన్నారు. ఈవీఎం కమిషన్ ప్రక్రియ ను మే 2 నుంచి5వ తేదీ వరకు చేపడుతామని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలన్నారు.పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను బీక్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

టీడీపీ కార్యకర్త వీరంగం

కృష్ణగిరి: మండల కేంద్రమైన కృష్ణగిరికి చెందిన టీడీపీ కార్యకర్త ఎరుకలి దేవేంద్ర బుధవారం రాత్రి వీరంగం సృష్టించాడు. పత్తికొండలో టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంకుమార్ నామినేషన్‌కు వెళ్లి గ్రామానికి వచ్చిన దేవేంద్ర కాలనీలో గొడవ జరుగుతుందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కానిస్టేబుల్ సూర్యప్రకాష్‌గౌడ్ అక్కడికి వెళ్లి జరుగుతున్న గొడవను తన సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తుండగా దానిని లాక్కుని బండకేసి కొట్టి కాలువలోకి విసిరేశాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్నారు. అయితే ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి రాజీ చేసేందుకు రంగంలోకి దిగినట్లు సమాచారం.

పారువేట గుర్రంపై రంగనాథుడి విహారం

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు బుధవారం స్వామివారు పారువేట గుర్రంపై విహరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ముస్తాబు చేసి పూలతో అలంకరించిన పల్లకీలో ఉంచి పారువేట గుర్రాన్ని తీసుకొని పాత రంగస్వామి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడ పారువేట గొర్రెను వదిలిపెట్టారు. అనంతరం రంగనాథస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పారువేట గుర్రంతో పాటు స్వామివారిని తీసుకొని పారువేట పద్యాలను పాడుకుంటూ భక్తులు స్వామివారిని తిరిగి దేవాలయానికి చేర్చారు. స్వామివారిపై పారువేట పద్యాలు, భక్తిపాటలు, భజనలు ఆకట్టుకున్నాయి.

నడిచే సంజీవని!

- ప్రాణాలు పోస్తున్న 108 వాహనాలు
- వాహనాలకు అత్యాధునిక సొబగులు
- ప్రతి మండలానికో వాహనం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 57 వాహనాలు
- వాహనాల్లో అత్యాధునిక వైద్యపరికరాలు, సేవలు
- ఏటా లక్షన్నర మందికి పైగా సేవలు



కర్నూలు(హాస్పిటల్): ప్రాణానికి ఆపద ఉందని ఒక్క ఫోన్ చేస్తే చాలు కుయ్ కుయ్‌మంటూ పావుగంటలో మీ ముందుంటుంది 108 అంబులెన్స్ వాహనం. వచ్చీ రాగానే ఆపదలో ఉన్న వ్యక్తికి ప్రాథమిక చికిత్స చేస్తుంది. ఆ వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు రోగులను తరలిస్తుంది. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మానస పుత్రిక అయిన ఈ వాహనం ఆయన తదనంతరం ఉనికి కోసం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో తండ్రి కంటే మిన్నగా వాహనాలను రూపుదిద్ది, వాహనాలను రెట్టింపు చేసి మరీ వైద్యసేవలు ప్రజలకు అందేలా చేస్తూ వందలాది మంది ప్రాణాలు కాపాడుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2005 సంవత్సరంలో 108 అంబులెన్స్ సేవలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. మొదట్లో కర్నూలు, ఆదోని, నంద్యాల, శ్రీశైలంలకు ఒక్కో వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం 2006లో మరో 28 వాహనాలు వీటికి జతచేరాయి. అన్ని రకాల ప్రమాదాలు, గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లడం, గుండెపోటు, మూర్ఛ వ్యాధి, ఇతర అత్యవసర అనారోగ్య పరిస్థితుల్లో రోగిని ఆసుపత్రికి తరలించడం వంటి సేవలను ఈ వాహనాలు నిర్వర్తించాయి. ఈ సేవలను ఇతర రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలూ మెచ్చుకుని అక్కడా అమలు చేశాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించాక వచ్చిన ప్రభుత్వాలు ఈ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశాయి. వాహనాలు పెంచకపోవడమే గాక ఉన్న వాహనాలనూ మరమ్మతులు చేయించకపోవడంతో ఏ వాహనం ఎప్పుడు ఎక్కడ ఆగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొని ఉండేది. ఉద్యోగులకు సైతం జీతభత్యాలు సరిగ్గా ఇచ్చేవారు కాదు. తాజాగా వైఎస్ఆర్ తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2020 జులై నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రతి మండలానికి ఒక వాహనం చొప్పున మొత్తం 57 వాహనాలు కేటాయించారు. వీటి ద్వారా కేవలం రోడ్డు ప్రమాదాలు, అత్యవసర మెడికల్ సర్వీసులకు, గర్భిణులకు ఆసుపత్రులకు తరలించడమే కాదు గర్భిణులకు ప్రతి నెలా 9వ తేదిన వైద్యపరీక్షలకు తీసుకెళ్లడం, డయాలసిస్ రోగులను, క్యాన్సర్ రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లడం వంటి సేవలు అందిస్తున్నాయి. ఇందులో చిన్నారుల ప్రాణాలను రక్షించేందుకు గాను ఆదోని, నంద్యాలలో అత్యాధునిక నియోనేటల్ వాహనాలు కూడా అందిస్తున్నాయి. 2020 జులై నుంచి ఇప్పటి వరకు 5లక్షల మందికి పైగా ఆపదలో ఉన్న వారిని 108 వాహనాల ద్వారా సేవలు అందించారు.



108 అంబులెన్స్‌లో ప్రసవం అయిన మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన రెహానా

108 అంబులెన్స్ ప్రత్యేకతలు



108 అంబులెన్స్, అందులోని అత్యాదునిక వైద్యపరికరాలు, సౌకర్యాలు

- ఆదోని, నంద్యాలలకు ఒక్కోటి చొప్పున నియోనేటల్ అంబులెన్స్‌లు ఉన్నాయి.
- 108 వాహనాల్లో 13 అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్(ఏఎల్‌ఎస్), 42 బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్‌ఎస్) వాహనాలు ఉన్నాయి.
- నడిచే ఐసీయు తరహాలో ఏఎల్‌ఎస్ సౌకర్యం ఉన్న వాహనంలో వెంటిలేటర్, డీఫిబ్రిలేటర్, ఇన్ఫ్యూజన్ పంప్స్, సిరంజి పంప్స్ ఏర్పాటు చేశారు.
- ప్రతి అంబులెన్స్‌లో ఆక్సిజన్, సక్షన్ ఆపరేటర్స్, మల్టీ పారా మానిటర్స్, అత్యవసర మందులు అందుబాటులో ఉంటాయి.
- ప్రతి వాహనంలో నియోనేటల్ వార్మింగ్ బ్లాంకెట్స్ ఉన్నాయి.

108లో డయాలసిస్‌కు వెళ్తున్నా



నాకు రెండు కిడ్నీలు పనిచేయడం లేదు. అందుకు డాక్టర్లు వారంలో రెండుసార్లు డయాలసిస్ చేయాలని నిర్ధారించారు. దీంతో వారంలో రెండుసార్లు 108 అంబులెన్స్ సహాయంతో కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నాను. నేను ఈ రోజు ప్రాణాలతో ఉన్నానంటే దానికి కారణం 108 అంబులెన్సే. మాలాంటి వాళ్ల కోసం ఇలాంటి పథకాన్ని అమలు చేస్తున్న సీఎం జగనన్నకు అభినందనలు.

–రంగన్న, దేవనకొండ

పాము కరిచినా ప్రాణాలు కాపాడారు



నేను పొలంలో పనిచేస్తుండగా పాము(రక్తపింజరి) కరడంతో స్పృహ తప్పి పడిపోయాను. అప్పుడు మా వాళ్లు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో పావు గంటలో అంబులెన్స్ మా వద్దకు వచ్చింది. దగ్గరలో ఉన్న వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం మళ్లీ దేవనకొండ నుంచి కర్నూలుకు 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లి నా ప్రాణాలు కాపాడారు. ఇలాంటి సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– ఈరమ్మ, గుండ్లకొండ, దేవనకొండ మండలం

20 నిమిషాల్లో వచ్చి ప్రాణాలు కాపాడింది



నేను ద్విచక్రవాహనంపై కర్నూలుకు వస్తుండగా ప్రమాదవశాత్తూ ఉలిందకొండ దగ్గరలో డివైడర్‌ను ఢీకొట్టాను. వెంటనే 108 అంబులెన్స్ సేవలు కావాలని అని టోల్‌ఫ్రీ నెంబర్‌కు స్థానికులు ఫోన్ చేసి పిలిపించారు. 20 నిమిషాల్లో వాహనం నా వద్దకు వచ్చి నాకు ప్రాథమిక చికిత్స చేసి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందేలా చేసింది. ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టి మాలాంటి వారి ప్రాణాలు కాపాడుతున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాము.

–హుసేన్‌సాహెబ్, కర్నూలు

అంబులెన్స్‌లోనే మహిళ ప్రసవం



నేను గత కొన్ని సంవత్సరాలుగా ఆశా వర్కర్‌గా పనిచేస్తున్నాను. మాది ఆస్పరి మండలం బినిగేరి గ్రామం. గ్రామానికి చెందిన జయంతి అనే నిండు గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశాం. 18 నిమిషాల్లో అంబులెన్స్ వచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ఆమెకు నొప్పులు అధికమయ్యాయి. దీంతో అంబులెన్స్ సిబ్బంది ఎంతో చాకచక్యంగా ఆమెకు ప్రసవం చేసి పండంటి బిడ్డను ప్రసవించేలా చేశారు. అనంతరం ఆమెను సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించారు.

–ఈరమ్మ, ఆశా వర్కర్

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

కర్నూలు(లీగల్): జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిలుగా పనిచేస్తున్న కొందరిని రాష్ట్ర హైకోర్టు బుధవారం రాత్రి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జె.కిషోర్‌కుమార్‌ను ప్రకాశం జిల్లా మార్కాపురానికి బదిలీ చేశారు. డోన్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న పి.హనీషాను పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి బదిలీ చేసి, ఆ స్థానంలో చిత్తూరు జిల్లా పీలేరులో పనిచేస్తున్న సాకే జ్యోతిని నియమించారు. పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వి.దివ్యను నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఎమ్మిగనూరులో పనిచేస్తున్న కె. గురుఅరవింద్‌ను చిత్తూరు జిల్లా వాయల్పాడుకు బదిలీ చేశారు. ఖాళీగా ఉన్న కర్నూలు ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్‌గా విజయనగరం జిల్లా బొబ్బిలిలో పనిచేస్తున్న ఎం.సరోజినమ్మను నియమించారు. అలాగే ఖాళీగా ఉన్న ఆదోని ఏడీఎం జడ్జిగా పిఠాపురంలో పనిచేస్తున్న ఎం.లీలా సాయి సుభాష్‌ను నియమించారు. నంద్యాలలో పనిచేస్తున్న జి.అర్చనను ఆదోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన జూనియర్ సివిల్ జడ్జిలు మే 3వ తేదీ లోగా వారివారి స్థానాల్లో బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

యాచకురాలి మృతి



మృతి చెందిన మహిళ

ఆదోని సెంట్రల్: రైల్వే స్టేషన్‌లోకి వెళ్లే మార్గంలో మెట్ల వద్ద యాచకురాలు మృతి చెందిందని రైల్వే ఎస్‌ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సర్వేశ్వర రావు బుధవారం విలేకరులకు తెలిపారు. మృతురాలిని గుర్తు పట్టడానికి ఆమె దగ్గర ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. ఆమె మూడేళ్ల నుంచి భిక్షాటన చేస్తోందని, అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి మున్సిపల్ అధికారుల సహాయంతో ఆదోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

యువకుడి మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): రోడ్డు ప్రమాదంలో వెల్దుర్తి పట్టణానికి చెందిన తెలుగు నరేష్ కుమార్ (39) మృతిచెందాడు. మరో యువకుడు బోయ రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. వెల్దుర్తి పట్టణం వైపు నుంచి హైవే పైకి బైక్‌పై వెళ్తుండగా డోన్ రైల్వే గేట్ అవతల హైవేలో కర్నూలు నుంచి డోన్ వైపు ప్రయాణిస్తున్న లారీ ఢీకొట్టింది. బైక్‌పై నుంచి కింద పడ్డ నరేశ్, రామాంజనేయులును హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. నరేశ్ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. క్షతగాత్రుడు రామాంజనేయులు చికిత్స పొందుతున్నాడు. నరేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో వన్యప్రాణులకు ముప్పు

- ఎన్‌ఎస్‌టీఆర్, శ్రీశైల దేవస్థానం పరిధిలో ప్లాస్టిక్ నిషేధించాలి
- మే నెల నుంచి గాజు బాటిళ్లలోనే నీటి విక్రయాలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కన్జర్వేటర్ మూర్తి

శ్రీశైలం ప్రాజెక్ట్: ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం కలుషితం కావడంతో పాటు నల్లమలలోని వణ్యప్రాణుల జీవన మనుగడకు ముప్పు వాటిల్లుతోందని శ్రీశైలం ఫారెస్ట్ కన్జర్వేటర్ బీఎస్ఎన్ మూర్తి అన్నారు. బుధవారం బయోడైవర్సిటీ ల్యాబ్‌లో సంబంధిత అధికారులు, వ్యాపారస్తులు, స్థానికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ – శ్రీశైలం టైగర్ రిజర్వ్, ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం పరిధిలోని అన్ని గ్రామాలు పూర్తిగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలన్నారు. ఏప్రిల్ మాసాంతంలోగా వ్యాపారస్తులు ప్లాస్టిక్ ప్యాకింగ్‌తో కూడిన ఏ ద్రవ,ఘన పదార్థాలు అమ్ముకోవాలని, మే 1వతేదీ నుంచి ఎవరు విక్రయించినా అటవీశాఖ చట్టాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతినెలా ఈ పరిసరాల్లో ఎన్నో మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నల్లమల జీవన వైవిధ్యం దెబ్బతింటుందన్నారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్లాస్టిక్ వినియోగం వల్ల దుష్పరిణామాలు, గాజు బాటిళ్లు, జూట్ బ్యాగ్‌ల వినియోగం వలన కలిగే సత్ఫలితాలను జీవా ప్రతినిధి బాస్కీషా వివరించారు. సమావేశంలో శ్రీశైలందేవస్థానం ఈఓ పెద్దిరాజు మాట్లాడుతూ క్షేత్రపరిధిలో ఇప్పటికే ప్లాస్టిక్ నిషేధాన్ని చాలా వరకు అమలు చేశామన్నారు. అన్నదానంలో అరటి ఆకులు, విస్తర్లలో భక్తులకు భోజనం వడ్డిస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని తగ్గించడం కోసం భూమిలో కరిగిపోయే మొక్కజొన్నతో తాయారుచేసిన వాటర్‌తో కూడిన బాటిల్‌లు ఏఈ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సప్‌లై చేస్తున్నారన్నారు. అలాగే అటవీశాఖ, స్థానికులు, వ్యాపారస్తులు కలిసి శ్రీశైలంలోనే బయోవాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయదలిస్తే భూమి, నీరు, విద్యుత్ సౌకర్యం దేవస్థానం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం ఫారెస్ట్ డివిజనల్ డెరెక్టర్లు సాయిబాబు, విఘ్నేష్ అపావ్, బయోడైవర్సిటీ అసిస్టెంట కన్జర్వేటర్ ధనరాజ్, శ్రీశైలం దేవస్థాన ఇఓ డి.పెద్దిరాజు, ఎఇఓలు అయ్యన్న, మల్లికార్జునరెడ్డి, గుజరాత్‌కు చెందిన 'జీవ' స్వచ్ఛందసేవా సంస్థ ప్రతినిధులు రాకేష్ కల్వ, బయోవాటర్ ప్రతినిధి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు జరగకుండా చూడాలి



ఆశా కార్యకర్తకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మాతాశిశు మరణాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆశాలపై కూడా ఉందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. స్థానిక మహిళా ప్రాంగణంలో జరుగుతున్న 6, 7 మాడ్యూల్స్‌పై నూతనంగా నియమితులైన ఆశా కార్యకర్తలకు 10 రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల ద్వారా నేర్చుకునేందుకు ఆశాలకు మంచి అవకాశం అన్నారు. ఆశాలు అందరూ హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ విజిట్లను చురుకుగా నిర్వహించి ఆరోగ్యసేవలు అందరికీ అందించేలా కృషి చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణిలను, నవజాత శిశువులను ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది గృహసందర్శనలు చేసి ఆరోగ్యపర్యవేక్షణ చేయాలన్నారు. ఆశా కార్యకర్తల శిక్షణ ముగింపు సందర్భంగా వారికి శిక్షణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి ఇందిర, డెమో ప్రమీలాదేవి, డీసీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

అరచేతిలో అభ్యర్థి సమాచారం

- ప్రత్యేక యాప్‌ను రూపొందించిన ఎన్నికల సంఘం
- 'నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ)' లో పోటీ చేసే అభ్యర్థుల పూర్తి వివరాలు
- నామినేషన్ దాఖలు చేసిన వెంటనే యాప్‌లో అప్‌లోడ్
- క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్, ఆస్తిపాస్తుల వివరాలు అన్నీ లభ్యం



సాక్షి, నంద్యాల: 2024 సార్వత్రిక ఎన్నికలలో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఎన్నికలలో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు మంచి ముహూర్తాలు చూసుకుని ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. తమ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థి పూర్తి వివరాలు తెలుసుకోవాలనే ఉత్సుకత ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అభ్యర్థి స్థిర, చరాస్తులు, కుటుంబ వివరాలు, క్రిమినల్ కేసులు తదితర వివరాలన్నీ తెలుసుకునే వీలును ఎన్నికల సంఘం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. 'నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ)' పేరుతో అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచింది. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ప్లే స్టోర్, యాప్ స్టోర్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని అభ్యర్థి వ్యక్తిగత వివరాలతో పాటు క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్‌ను తెలుసుకోవచ్చు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే సందర్భంగా సమర్పించే అఫిడవిట్ వివరాలను వెంటనే సంబంధిత అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన మొదటి, రెండో రోజు రాష్ట్ర వ్యాప్తంగా దాఖలైన నామినేషన్ల వివరాలు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

- ఆండ్రాయిడ్/ఐ ఫోన్ వినియోగదారులు ప్లే స్టోర్‌కి వెళ్లి నో యువర్ క్యాండిడేట్ యాప్ డౌన్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- ఇన్‌స్టాల్ పూర్తయిన తర్వాత ఓపెన్ చేయగానే ప్రొసీడ్ ఆప్షన్ డిస్ ప్లే అవుతుంది.
- యాప్‌లోకి వెళ్లిన తర్వాత సెలెక్ట్ క్రైటీరియా ఆప్షన్ చూపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి.
- అందులోకి వెళ్లి పార్లమెంట్ నియోజకవర్గం, ఏ సంవత్సరానికి సంబంధించిన వివరాలు కావాలో ఆ ఇయర్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.
- స్టేట్, నియోజకవర్గ వివరాలను సెలెక్ట్ చేసి సబ్మిట్ చేయగానే ఆ నియోజకవర్గంలో ఎవరెవరు నామినేషన్ దాఖలు చేశారో వివరాలు డిస్‌ప్లే అవుతాయి.
- అందులో మనం తెలుసుకోవాల్సిన అభ్యర్థిపై క్లిక్ చేస్తే ఆయన సమర్పించిన అఫిడవిట్ వస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకుని ఆ అభ్యర్థి పూర్తి వివరాలను మనం వెంటనే తెలుసుకోవచ్చు.
- ప్రస్తుతానికి ఈ యాప్‌లో 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల నుంచి ఆ తర్వాత జరిగిన ఎన్నికల సమాచారం అందుబాటులో ఉంది.

కేఈ శ్యాంబాబుకు సొంతిల్లు లేదట!

- అభ్యర్థుల నామినేషన్ల అఫిడవిట్లలో ఆస్తుల వివరాలు

కర్నూలు(సెంట్రల్): పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ కుటుంబానికి అమరావతిలో రూ.5.54 కోట్ల విలువ చేసే 38,002 చదరపు అడుగుల ఖాళీ స్థలం ఉన్నప్పటికీ సొంత ఇల్లు లేదని అఫిడవిట్‌లో చూపారు. తండ్రి డిప్యూటీ సీఎంగా పనిచేసినా కుమారుడికి మాత్రం సొంతిల్లు లేకపోవడం గమనార్హం. ఇటీవల ఆయన పత్తికొండ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేయగా..తాను ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను వెల్లడించారు. తన పేరిట కృష్ణగిరి, కంబాలపాడులలో రూ.19.40 లక్షల విలువ చేసే 12.33 ఎకరాల పొలం, రూ.31.79 లక్షల విలువ చేసే ఫార్చునర్ కారు ఉన్నట్లు చూపారు. భార్యకు రూ.32 లక్షల విలువ చేసే 46.58 తులాల బంగారు, రూ.15 లక్షల విలువ చేసే 16.50 కేజీల వెండి ఆభరణాలు ఉన్నాయని పేర్కొన్నారు. తన పేరిట రూ. 3,23,18,090 చరాస్తులు, భార్యకు రూ..1,32,14,007 చరాస్తులు ఉన్నట్లు చూపారు. ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల దగ్గర రూ.1,19,76,800 అప్పు తీసుకున్నట్లు, తన భార్యకు రూ.19.50 లక్షల అప్పు ఇచ్చినట్లు చెప్పారు. తనపై ఒక్క కేసు కూడా లేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

రాఘవేంద్రారెడ్డికి రెండు కార్లు

మంత్రాలయం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎన్.రాఘవేంద్రారెడ్డికి రెండు కార్లు ఉన్నాయి. అంతేగాక అతను, అతని భార్య ఎన్.యశోదమ్మకు దాదాపు 31 ఎకరాల పొలాలు ఉన్నాయి. మాధవరంలో ముగ్గురి భాగస్తుల్లో కమర్షియల్ కాంప్లెక్స్ అతనిపేరిట ఉంది. అతని ఎలాంటి కేసులు లేవని ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరచారు. ఆయనకు రూ.3.92 లక్షల విలువ చేసే 5.6 తులాల బంగారు అభరణాలు, భార్య ఎన్. యశోదమ్మకు రూ.9.10 లక్షల విలువ చేసే 13 తులాల బంగారం అభరణాలు ఉన్నట్లు తెలిపారు. అంతేకాక ఆయన పేరిట రూ.40.70 లక్షల చరాస్తి, భార్యకు రూ.26.26 లక్షల చరాస్తితోపాటు రూ.33 లక్షల విలువ చేసే స్థిరాస్తులు ఉన్నాయి. ఆయన పేరిట స్థిరాస్తులు మాత్రం రూ.2.94 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. కుమారుడు రాకేష్‌రెడ్డి పేరిట 35 లక్షల స్థిరాస్తి, రూ.20 లక్షల చరాస్తి ఉన్నట్లు చూపారు. రాఘవేంద్రారెడ్డికి రూ.1.68 కోట్ల అప్పులు, భార్యకు రూ.21 లక్షల అప్పు ఉన్నట్లు ప్రకటించారు.

వై.బాలనాగిరెడ్డికి వ్యవసాయ భూములే ఆస్తులు

మంత్రాలయం వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వై.బాలనాగిరెడ్డి, ఆయన భార్య జయమ్మకు కలిపి 44.06 ఎకరాల వ్యవసాయ పొలాలు ఉన్నాయి. ఇందులో బాలనాగిరెడ్డి పేరిట 37.45 ఎకరాలు, భార్య పేరిట 6.61 ఎకరాల పొలం ఉంది. ఆయనకు పేరిట ఒకకారు, భార్య పేరిట మరొక కారు ఉంది. ఆయన రూ.12 లక్షల విలువ చేసే 400 గ్రాములు బంగారు ఆభరణాలు, రూ.4 లక్షల విలువ చేసే 10 కేజీల వెండి ఆభరణాలు ఉన్నాయి. అలాగే ఆయన భార్య పేరిట రూ.4.85 లక్షల విలువ చేసే 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.2.5 లక్షల విలువ చేసే 5 కేజీల వెండి ఉంది. కాగా, బాలనాగిరెడ్డిపై 2012లో కోసిగి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు విచారణలో ఉంది.

ఇంతియాజ్‌కు సొంత వాహనం లేదు

సెర్ప్ సీఈఓ, సీసీఎల్ఏ అదనపు కార్యదర్శిగా పనిచేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసి రాజకీయాల్లోకి వచ్చిన ఏఎండీ ఇంతియాజ్‌కు సొంత వాహనం లేదు. బుధవారం ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫునన కర్నూలు అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా సమర్పించిన అవిడవిట్‌లో తనకున్న ఆస్తి వివరాలను ప్రకటించారు. తన చరాస్తిగా రూ.41.36 లక్షలు, భార్య సమీనకు చరాస్తిగా రూ.18.42 లక్షలు మాత్రమే ఉన్నట్లు ప్రకటించారు. ఇందులో వారికి విలువైన వాహనాలుగాని, ఖరీదైనా వజ్రాలు, బంగారు, వెండి, అభరణాలేవి లేవు. స్థిరాస్తుల్లో ఆయన భార్య సమీనకు కర్నూలులోని ఎన్ఆర్ పేటలో 378 చదరపు అడుగుల్లో నిర్మించిన ఇల్లు ఉంది. అలాగే ఆయనకు రాజధాని క్యాపిటల్ సిటీలోని ఐనవోలులో 4500 చదరపు అడుగుల కాళీ స్థలం, ఆయన భార్య సమీనకు కల్లూరులో 2800 చదరపు అడుగుల ఖాళీ స్థలం ఉంది. స్థిరాస్తి విలువలో ఇంతియాజ్‌కు రూ.30 లక్షలు, ఆయన భార్యకు రూ.30 లక్షలు ఉన్నాయి. మొత్తంగా ఆయనకు చరాస్థిరాస్తులు కలిపి రూ. 71,36,560, ఆయన భార్య సమీనకు 68, 42,603 లక్షల రూపాయలు ఉన్నాయి. ఆయనపై ఎలాంటి కేసులు లేవు.